క్లుప్తంగా

పరామర్శ


పరామర్శిస్తున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్

మంథని: మంథనికి చెందిన మాల మహానాడు రాష్ట్ర నాయకుడు నూకల బానయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాగా చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి శుక్రవారం బానయ్యను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడొద్దని ఎల్లవేళలా అండగా ఉంటామని వివేక్ హామీ ఇచ్చారు. మాల మహానాడు నాయకులు నూకల శంకర్, కొవ్వూరి రాజలింగు, జంజర్ల రాజు, అప్పాల పోచమల్లయ్య, బోగె లింగయ్య, బడికెల నర్సయ్య, దాసరి గట్టయ్య, ముంత పోచయ్య, గడిపెల్లి అజయ్, దార మధు, జంజర్ల శంకర్, పొనగంటి రమేశ్, దాసరి రాజేశం, నూకల సురేందర్, నూకల కమల్, ఆర్ల దేవేందర్, జంజర్ల సుదర్శన్, ఆర్ల క్రాంతి, కొవ్వూరి వేణుప్రసాద్, ఆర్ల జ్ఞాని పాల్గొన్నారు. కాగా మండంలోని లక్ష్మీపూర్ గ్రామస్తులు బస్‌షెల్టర్ నిర్మాణం కోసం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు.

బీఆర్ఎస్ పాలనలో రైతులకు నష్టం జరిగింది


మాట్లాడుతున్న బాలాజీ

ముత్తారం: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మండలంలోని అడవిశ్రీరాంపూర్ రైతులకు నష్టం జరిగిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య ఆరోపించారు. ముత్తారంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ముత్తారం మండలం చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని మంత్రి శ్రీధర్ బాబు తన హయాంలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు తీసుకువచ్చారన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు పుట్ట మధూకర్ నిర్లక్ష్యంతోనే అడవిశ్రీరాంపూర్ వరకు కాలువ నిర్మాణం కాకపోవడంతో ఆ ప్రాజెక్టు సాగునీరు అందడం లేదని విమర్శించారు. దీనికి పుట్ట మధు బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు.

వాహనాల తనిఖీ

ఓదెల: మండలంలోని గుంపుల గ్రామంలో పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. గుంపుల మీదుగా సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్ వైపులకు వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు. అనుమతి పత్రాలు వాహనాలకు జరిమానా విధించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

పాలకుర్తి: మండల పరిధిలోని కన్నాల గ్రామంలో ఒక షెడ్డులో అక్రమంగా ప్రజా పంపిణీ బియ్యం నిల్వ ఉంచినట్లు అందిన సమాచారం మేరకు శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాలలో 20 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా బియ్యం నిల్వ ఉంచిన బోయిని పెద్దరాజం (గోదావరిఖని), పస్తం బాబు (కన్నాల)ను అదుపులోకి తీసుకొని విచారణ నిమిత్తం బసంత్‌నగర్ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేర్కొన్నారు. ఈ సోదాలో టాస్క్‌ఫోర్స్ సీఐ రమేశ్‌బాబు, ఎస్సై రాజేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు స్పందన

మంథని: మంథని ఆర్టీసీ డిపో పరిధిలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రయాణికుల నుంచి మంచి స్పందన వచ్చినట్లు డిపో మేనేజర్ శ్రవణ్ కుమార్ తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రయాణికులు తనను అడిగిన ప్రశ్నలకు సలహాలు, సూచనలు చేశామని ఆయన తెలిపారు. ఇందులో ప్రధానంగా మంథని నుంచి జమ్మికుంటకు వెళ్లే ఓడేడు సర్వీసును పునరుద్ధరించాలని ముగ్గురు ప్రయాణికులు విన్నవించారని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే సర్వీస్ పునరుద్ధరిస్తామని ఆయన తెలిపారు. కరీంనగర్ నుంచి మంథనికి రాత్రి తొమ్మిది గంటల తర్వాత బస్సు సర్వీసు నడిపేలా చూడాలని మరికొందరు ప్రయాణికులు కోరారని డిపో మేనేజర్ వివరించారు.

16న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

సుల్తానాబాద్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 16న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, గట్టయ్య తెలిపారు. 14, 16, 18, 20ఏళ్ల వయస్సు గల వారికి పోటీలు ఉంటాయని పేర్కొన్నా రు. క్రీడాకారులు ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం వెంట తీసుకొని ఉదయం 7గంటలకు పాఠశాల మైదానానికి రావాలని వారు కోరారు.


సుల్తానాబాద్‌రూరల్‌: హోలీ వేడుకల్లో మహిళలు, చిన్నారులు


రామగుండం: పాతబజార్‌లో సంబరాలు


జ్యోతినగర్: వేడుకల్లో మహిళలు, చిన్నారులు


రామగుండం: రైల్వేస్టేషన్ ఎదుట..


ఫెర్టిలైజర్‌సిటీ: టౌన్‌షిప్‌లో..

కలర్‌ఫుల్ జోష్

జిల్లావ్యాప్తంగా రామగుండం, పెద్దపల్లి, మంథని నియోజకవర్గాల్లో శుక్రవారం రంగుల హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. యువకులు, మహిళలు, చిన్నారులు, పెద్దలు ఉత్సాహంగా ఉదయమే రంగులు చల్లుకుని సంబరాలు జరుపుకున్నారు. ఒకరికొకరు రంగులు చల్లుకుని హోలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఒక్కచోట చేరి రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి సరదాగా సెల్ఫీలు దిగారు.

– సాక్షి నెట్‌వర్క్


సుల్తానాబాద్: స్వప్నకాలనీలో..


కాల్వశ్రీరాంపూర్‌లో..


గోదావరిఖని: వేడుకల్లో ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్


గోదావరిఖని: బీఎంఎస్ నాయకులు


ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో..


ఎలిగేడు మండలం ధూళికట్టలో..


ధర్మారం: వేడుకల్లో ఉపాధిహామీ కూలీలు


యైటింక్లయిన్‌కాలనీ: ఐఎన్‌టీయూసీ నాయకులు


కమాన్‌పూర్‌లో..

కూలీలకు ఉపాధి.. రైతులకు దారి

- ఉపాధిహామీ పనులతో పొలాలకు రోడ్ల నిర్మాణం
- రైతులకు తొలగనున్న దారికష్టాలు

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని రైతులు తమ చేలల్లోకి వెళ్లి పనులు చేసేందుకు, పండిన పంటలు తరలించేందుకు రహదారి సౌకర్యం సరిగా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులకు రోడ్ల కష్టాలు తీర్చాలన్న లక్ష్యంతో అధికారులు ఉపాధిహామీ పథకంలో గ్రామాల్లో కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు రైతుల ఇబ్బందులు తొలగించేందుకు పంట చేలకు మట్టిరోడ్లు నిర్మించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. అవసరమైన నూతన రోడ్లతో పాటు పాత రోడ్లకు గ్రావెల్ పోసి రైతుల ఇబ్బందులు తొలగించేందుకు అంచనాలు సిద్ధం చేసి అమలు చేస్తున్నారు.

ఈజీఎస్‌లో రోడ్ల నిర్మాణం, అంచనాలు..

మండలంలో 13 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అధికారులు గ్రామాల్లో గ్రామసభ సమావేశాలు ఏర్పాటుచేసి, ఎక్కడెక్కడ రోడ్లు వేయాలన్న నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు అనుగుణంగా 1.28కోట్ల అంచనాలు సిద్ధం చేశారు. ఇందులో ఏడు కొత్తగా పంటపొలాలకు గ్రామీణ రహదారులు కాగా 9 రోడ్లపై మొరం పోసి కూలీలతో లెవెల్ చేసే పనులు చేపట్టారు. రోడ్ల నిర్మాణం పూర్తయితే రైతుల దారి కష్టాలు తీరి, తమపంటలను కొనుగోలు కేంద్రాలకు తరలించే పనులు మరింత సులభతరం కానుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


జూలపల్లి: పెద్దాపూర్ నుంచి గుట్టవైపు పొలాల దారిలో మొరం చదును చేస్తున్న ఉపాధి కూలీలు

ఉపాధి దొరుకుతోంది



పొలాలకు వెళ్లేదారిలో రోడ్ల పనులు చేస్తుడడంతో కూలీలకు ఉపాధి దొరుకుతోంది. ఎండాకాలంలో ఉదయమే పనులు చేయించాలి. ప్రతీ పదిహేను రోజుకోసారి కూలీలకు డబ్బులు చెల్లించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎ.శ్రీనివాస్, జూలపల్లి, ఉపాధిహామీ కూలీ

పనులు పూర్తి చేస్తాం



రైతుల పంట పొలాలకు వెళ్లేందుకు రోడ్లతో పాటు పాత రోడ్లపై మొరం పోసే పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం. నిర్ణయించిన మేరకు పనులు చేపట్టి పూర్తి చేసేందుకు వేగంగా మొరం పోసి కూలీలతో లెవల్ చేసే పనులు సాగుతున్నాయి.

– సదానందం, ఉపాధిహామీ ఏపీవో, జూలపల్లి

నిరుపయోగంగా సీసీ కెమెరాలు

జూలపల్లి: గ్రామాల్లో దొంగతనాలు, సంఘ వ్యతి రేక కార్యకలాపాలు సాగించే వారిని నియంత్రించేందుకు, ప్రజలకు భద్రత పెంచేందుకు దాతల సహకారంతో గ్రామాల్లో ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. కాచాపూర్‌లో మోటార్ల దొంగతనాలు, జూలపల్లిలోని ఆలయాల్లో హుండీల దొంగలను సీసీ కెమెరాలు పని చేయకపోవడంతోనే పట్టుకోలేక పోయారని స్థానికంగా మాట్లాడుకుంటున్నారు. దాతలు వెచ్చించిన రూ.లక్షలతో అమర్చిన సీసీ కెమెరాలను ఎవరూ పట్టించుకోక పోవడంతో నిరుపయోగంగా మారాయి. అధికారులు పట్టించుకొని సీసీ కెమెరాలను వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.



వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

వారసంత.. ప్రమాదాల చింత

- రోడ్డుపైనే క్రయ విక్రయాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు.. పాలకులు

ధర్మారం: మండల కేంద్రంలో ప్రతీ మంగళవారం నిర్వహించే వారసంతతో వినియోగదారులు, వ్యాపారులు తిప్పలు పడుతున్నారు. ఈ సంతకు ప్రత్యేక స్థలం కేటాయించకపోవటంతో రాష్ట్ర రహదారితో పాటు ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా వ్యాపారులు టెంట్లు వేసుకుని క్రయవిక్రయాలు కొనసాగిస్తున్నారు. రోడ్డుపై భారీ వాహనాల రాకపోకలతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రభుత్వ అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు చేస్తున్నారు.

ఏటా రూ.లక్షల్లో ఆదాయం..

ఈ వారసంత ద్వార గ్రామపంచాయితీకీ ఏటా రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. కానీ వ్యాపార లావాదేవీలు, వినియోగదారుల సౌకర్యార్థం ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దాదాపు మూడు దశాబ్దాలుగా రోడ్డుపైనే వారసంత కొనసాగుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

5 మండలాలకు కేంద్ర బిందువు..


రోడ్డుకి ఇరువైపులా దుకాణాలు

మండల కేంద్రంలో ప్రతీ మంగళవారం నిర్వహించే వారసంత 5 మండలాల ప్రజలకు కేంద్ర బిందువుగా ఉంది. ధర్మారం మండలంతో పాటు వెల్గటూర్, ఎండపల్లి, పాలకుర్తి, గొల్లపెల్లి మండలాలతో పాటు లక్షెట్టిపేట్, చొప్పదండి మండలాల నుంచి రైతులు ప్రజలు, వ్యాపారులు ఈ వారసంతకు వస్తుంటారు. అన్నిరకాల కూరగాయలు, నిత్యవసరాల వస్తువులు, వస్త్రవ్యాపారులు ఇక్కడ క్రయవిక్రయాలు చేస్తుంటారు. తాజా కూరగాయలు లభిస్తుండటంతో వేలాది మంది వినియోగదారులు సంతకు వచ్చి కొనుగోలు చేస్తారు. ఫలితంగా వారసంత ప్రాంతం ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీగా ఉంటుంది.

పట్టించుకోవడం లేదు..

వారసంత నిర్వహణకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ప్రభుత్వ స్థలం కేటాయించి, షెడ్లు నిర్మించాలని స్థానికులు, వ్యాపారులు కోరారు. కానీ ఎవరూ పట్టించుకోలేదు. ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ వారసంత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టీబీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ధర్మారం: టీబీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధిగ్రస్తుల గుర్తింపులో యువకులు సహకరించాలని మండల వైద్యాధికారి అనుదీప్ కోరారు. టీబీ అక్షయ్ శివిర్ కార్యక్రమంలో భాగంగా ధర్మారం మండలం నందిమేడారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నాలుగురోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమం శుక్రవారం ముగిసింది. టీబీ అనుమానిత లక్షణాలున్న వారి నుంచి తెమడ సేకరించి వ్యాధి నిర్ధారణ కోసం పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి అనుదీప్ తెలిపారు. వైద్యాధికారులు సుష్మిత, గౌతం కుమార్ పాల్గొన్నారు.

నేడు, రేపు శ్రీసాయిబాబా ఆలయ వార్షికోత్సవం

రామగుండం: స్థానిక రైల్వేస్టేషన్ ఎదుట కొండపై నెలకొన్న సాయిబాబా ఆలయ వార్షికోత్సవం శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కన్నూరి సతీశ్‌కుమార్ తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన దాతల సహకారంతో విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం జరిగి ఈనెల 15 నాటికి 29 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వార్షిక వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే తొలిరోజు దేవతా స్థాపనలు, ఆదివారం 108 మంది పుణ్య దంపతులతో శ్రీశివ సుబ్రహ్మణ్యస్వామి మహాయాగ మహోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. ఇప్పటికే భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపడుతున్నారు.